క్లుప్తంగా

కన్యకాపరమేశ్వరికి పూజలు



కొడకండ్ల: మండలకేంద్రంలోని రామాలయంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి బుధవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పిండిపోలు నాగదక్షిణమూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అమ్మవారిని అలంకరించగా, మహిళలు ఒడి బియ్యం అందజేశారు.

సన్మానం



లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన చిందుయక్షగాన కళాకారుడు గడ్డం శ్రీనువాసును కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సన్మానించారు. న్యూఢిల్లీలోని కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో భారతదేశ సనాతన సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన వృత్తి కళలను భవిష్యత్ తరాలకు అందించాలనే కళా దీక్ష కార్యక్రమాన్ని మేఘదూత్ థియేటర్‌లో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గురు శిష్యపరంపర స్కీంకు తెలంగాణ రాష్ట్రం నుంచి చిందు యక్షగాన కళాకారుడు గడ్డం శ్రీనువాసును కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సన్మానించారు.

ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు



స్టేషన్‌ఘన్‌పూర్: అసెంబ్లీ ఎన్నికల విజయవంతానికి కృషి చేసిన ప్రతీ ఒక్క అధికారికి ప్రత్యేక కృతజ్ఞతలని ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వాసం రాంమూర్తి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎన్నికల విజయవంతంపై విధుల్లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు అంటే కత్తిమీది సాములాంటిదని, కొన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి చేయడంలో మీ సహకారం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో ఆఫీస్ సబార్డినేటర్లు, అంగన్‌వాడీ, వైద్య, విద్యుత్ సిబ్బంది ఎంతో సహకరించారని తెలిపారు. ఎన్నికల్లో ఎదుర్కొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకవస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటివి తలెత్తకుండా చూస్తానని అన్నారు.

మేడారంలో మొక్కులు



పాలకుర్తి: పాలకుర్తి నియోజకవర్గంలో యశస్విని రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మేడారం వనదేవతలను కాంగ్రెస్ నాయకులు బుధవారం దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకుర్తి మండలం నారబోయినగూడేనికి చెందిన కాంగ్రెస్ నాయకులు మూడావత్ సోమేశ్, గుగులోత్ యాకన్న, మూడావత్ రాజు, బానోత్ శ్యాం, మంగ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ మండలస్థాయి సమీక్ష

దేవరుప్పుల: మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో నేడు(గురువారం) మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రానున్నందున ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ మండల నాయకులు, ఆయా గ్రామాల బాధ్యులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

వైన్ షాపు తొలగించాలి



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలలో జనావాసాల మధ్య ఉన్న వైన్ షాపును తొలగించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుమార్, పాశం శిరీషసురేష్, తీగల మహేందర్, గడ్డమీది సురేష్, ఇల్లందుల యాదగిరి, మూల నాగరాజు, యాదవరెడ్డి, మర్రి దుర్గాప్రసాద్, సాదం గట్టేష్, పుట్ట కిరణ్ రెడ్డి, జక్కుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలా.. దివాలా..

- దుర్భర జీవితాలు గడుపుతున్న ఆటో కార్మికులు
- ఆటో నడిపితే గాని పూటగడవని దుస్థితి
- సంపాదనలో సగానికి పైగా ట్యాక్స్‌లకే
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మరింత తిప్పలు



స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ సమీపాన ఆటోస్టాండ్ వద్ద నిలిపిన ఆటోలు

స్టేషన్‌ఘన్‌పూర్: 'దేవుడైన జీవుడైన రిక్షావోడురా.. ఆకశాన సూరిబాబు రిక్షావోడురా..' అంటూ ఓ సినీకవి చెప్పిన నాటి మాటలకు ప్రస్తుతం అర్థం వేరేలా మారింది. ప్రస్తుతం బతుకుబండిని లాగేందుకు పొద్దంతా కష్టపడి పనిచేసినా పూటగడవని పరిస్థితుల్లో ఆటోడ్రైవర్లు దుర్భర జీవితాలు గడుపుతున్నారు. పేద కుటుంబాల్లో పుట్టడంతో ఉన్నత చదువులు చదవలేక, చదివినా సరైన ఉద్యోగాలు రాక బతుకుబండిని లాగేందుకు అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నిరుద్యోగ యువత ఆటోడ్రైవర్ వృత్తిని ఎంచుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటో నడిపినా చాలీచాలని ఆటోఛార్జీలు వస్తుండగా కుటుంబ పోషణ కష్టతరంగా మారుతోంది. రోజంతా కష్టపడితే దాదాపు రూ.400 నుంచి రూ.500 వరకు సంపాదిస్తూ ఉపాధి పొందుతుండగా పూట గడవని స్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లాలో 4వేలకు పైచిలుకు ఆటో కార్మికులు

జనగామ జిల్లా వ్యాప్తంగా 12 మండలాలకు గాను 281 గ్రామ పంచాయతీలుండగా దాదాపు 4వేలకు పైచిలుకు ఆటో కార్మికులున్నారు. ఘన్‌పూర్ మండలంలో దాదాపు 600 మందికి పైగా ఆటోడ్రైవర్లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ పట్టణం హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ఉండగా ఇక్కడ నుంచి చుట్టుపక్కల మండలాలకు వెళ్లేందుకు కేంద్ర బిందువుగా ఉంది. ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లి హనుమకొండ–పాలకుర్తికి మధ్యలో ఉంటుంది. ఘన్‌పూర్ నుంచి చిన్నపెండ్యాల, కరుణాపురం, ఛాగల్లు, మీదికొండ, కొత్తపల్లి, తాటికొండ, శివునిపల్లి, జఫర్‌గడ్, నమిలిగొండ, ఇప్పగూడెం, పాలకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు, ఆయా గ్రామాల నుంచి ఘన్‌పూర్‌కు రావడానికి ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తుంటారు. ప్రధానంగా ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద, గాంధీ చౌరస్తా, రైల్వేగేటు, రైల్వేస్టేషన్, వివేకానంద చౌరస్తా, బ్యాంకు ఆఫ్ బరోడా, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆటోస్టాండ్‌లుండగా గ్రామాల్లోనూ ప్రత్యేకంగా ఆటోస్టాండ్‌లు ఉన్నాయి.

రెట్టింపైన ఇన్సూరెన్స్ చార్జీలు

ఆటోలకు గత ఏడాదితో పోలిస్తే ఇన్సూరెన్స్ చార్జీలు ఈ సంవత్సరం రెట్టింపైంది. గతంలో ఇన్సూరెన్స్ చార్జీ రూ.3,500 నుంచి రూ.4వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ.8వేల వరకు అయింది. అదేవిధంగా డీజిల్ ధరలు గత ఏడాది లీటర్‌కు రూ.80 ఉండగా ప్రస్తుతం రూ.98 అయింది. దాంతో ఆటోచార్జీలను పెంచాల్సి వచ్చిందని ఆటోడ్రైవర్లు చెబుతున్నారు. చదివిన చదువులకు ఉద్యోగాలు రాకపోవడంతో కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు నిరుద్యోగ యువకులు ఆటో డ్రైవర్ వృత్తిని ఎంచుకుంటున్నారు. రోజంతా పనిచేస్తే వచ్చే మొత్తంలో సగం డబ్బులు డీజిల్‌కే పోతున్నాయని, కుటుంబ పోషణ భారంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రతీ ఏడాది వచ్చిన సంపాదనలో సగానికి పైగా ట్యాక్స్‌లకే సరిపోతుందని వాపోతున్నారు.

ఆటోవాలాలకు ఇబ్బందులెన్నో..

ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెలంతా ఆటో నడిపితే రూ.6వేల నుంచి రూ.8వేల వరకు వస్తున్నాయి. ఆటోలకు ఇన్సూరెన్స్, సీబుక్, ఎఫ్‌సీ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్, లైసెన్స్ రెన్యూవల్, ట్యాక్స్ తదితర పత్రాల్లో ఏ ఒక్కటి లేకున్నా రవాణాశాఖ, పోలీసు అధికారులు కేసులు నమోదు చేస్తారు. కేసులు నమోదు చేస్తే కనీసం రూ.10వేల వరకు భారం పడుతుంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఆటో డ్రైవర్లు రూ.లక్షల్లో నష్టపోవాల్సి వస్తుంది.

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో మరింత ఇబ్బందులు

ఇప్పటికే ఆటోవాలాలు దివాలా తీస్తుండగా, నూతన ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడం వారికి మరింత కష్టంగా మారనుంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అధికంగా బస్సు ప్రయాణాలు చేస్తుంటారు. దానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో ఆటోవాలాలకు మరింత తిప్పలు తప్పేలా లేదు.

బ్యాంకుల్లో రుణాలు ఇవ్వాలని వేడుకోలు

పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు ఏ ఉద్యోగాలు రాక అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి జీవిస్తున్నారు. ఆటోలు కొనుగోలు చేసేందుకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదని, దాంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అధిక వడ్డీలు తీసుకుంటూ వడ్డీవ్యాపారులు ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆటోడ్రైవర్లకు జీవనోపాధి కోసం బ్యాంకులు రుణాలు అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆటోతోనే జీవనోపాధి



కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక అధిక వడ్డీకి అప్పులు తెచ్చి ఆటో కొనుగోలు చేశాను. ఏ ఉద్యోగం రాక గత పదేళ్ల నుంచి ఆటో నడుపుతున్నాను. పల్లెవెలుగు బస్సులు వచ్చినప్పటి నుంచి ఆటోలకు గిరాకీ బాగా తగ్గింది. రోజుకు కనీసం రూ.400 కూడా సంపాదించలేక పోతున్నాం. ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి.

– పాలకొండ మోహన్, ఆటో డ్రైవర్, శివునిపల్లి

రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి



ఆటో కొనుగోలు చేయాలనుకుంటే బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. దాంతో వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి ఆదుకోవాలి.

– రాజారపు జయపాల్, ఘన్‌పూర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

20 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా



20 ఏళ్లుగా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళలు ఆటోలను ఆశ్రయించడం లేదు. దాంతో మా కుటుంబం రోడ్డున పడే దుస్థితి నెలకొంది.

–ఎండీ.ఉస్మాన్, బచ్చన్నపేట

ఆటో డ్రైవర్ల గురించి ఆలోచించాలి



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఆటోలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల సమస్యలపై ఆలోచించాలి. బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో మా పొట్ట కొట్టొద్దు. జీవనోపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నల్ల రమేష్, పాలకుర్తి

నియామకం



నితీష్



కార్తీక్

జనగామ రూరల్: ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలు ఢిల్లీలో నిర్వహించగా ఈ మహాసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గుంటుపల్లి కార్తీక్, దేవులపల్లి నితీష్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో అనేక పోరాటాలు చేశారని విద్యార్థులను జాతీయవాదులుగా తయారు చేయడంలో విశేషంగా కృషి చేశారని తెలిపారు. తమపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గంలో స్థానం ఇవ్వడం ఆనందంగా ఉందని, అవకాశం కల్పించిన అధ్యక్షుడికి, ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞత తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



లింగాలఘణపురం: నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని బండ్లగూడెంలో జాగృతి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో చెడు వ్యసనాలకు యువత బానిసలు కావడంతో జరిగే దుష్ప్రభావాలు, మూఢనమ్మకాలు, సైబర్ క్రైం తదితర అంశాలపై పోలీసు కళాకారులు ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక రంగాలతో నేరాలు కూడా అదేవిధంగా పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ విజయకుమార్, కళాకారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



పన్నులు వసూలు చేస్తున్న కారోబార్ లలిత

బచ్చన్నపేట: పల్లెలే పట్టణాలకు పట్టు కొమ్మలని.. పల్లెలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఇంటి, నల్లా పన్నులు గ్రామస్తులు చెల్లించాలన్నారు. గ్రామస్తులు పన్నులు చెల్లిస్తేనే వీధి దీపాల నిర్వహణ, తాగునీటి వసతి చర్యలు, అదనపు సిబ్బంది వేతనాలు, జీపీ ట్రాక్టర్ల రుణ వాయిదాలను చెల్లించడానికి వీలవుతుందని చెప్పారు. ఈ నెల 31 లోపు గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని, జీపీ సిబ్బందికి గ్రామస్తులు సహకరించి పన్నులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'పొన్నాలకు మతిభ్రమించింది'

జనగామ: మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యకు వయస్సు మీదపడి మతిభ్రమించి సీఎం రేవంత్‌రెడ్డిపై అవాకులు, చెవాకులు పలుకుతున్నారని మున్సిపల్ మాజీ చైర్మన్ వేమెళ్ల సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ కాలుజారిపడి గాయపడ్డ మాజీ సీఎం కేసీఆర్ యశోధ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే పరామర్శించేందుకు వెళ్లిన, రేవంతరెడ్డిపై పొన్నాల చేసిన వ్యాఖ్యలతో రాష్ట్రం నవ్వుకుంటుందన్నారు. రేవంత్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయన్నారు. పిచ్చాస్పత్రికి వెళ్లి మెంటల్ కండీషన్ చెక్ చేయించుకోవాలని పొన్నాలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు.

కొనసాగుతున్న 'జీడీఎస్'ల సమ్మె



సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

జఫర్‌గఢ్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీసు ఎదుట ఆయా గ్రామాలకు చెందిన తపాలా జీడీఎస్(గ్రామీణ డాక్ సేవక్)లు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. టార్గెట్‌కు సంబంధించిన వేధింపులను నిలిపివేయాలన్నారు. వీటితో పాటు పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తపాలా జీడీఎస్ ఉద్యోగులు ఎండీ అంకూస్, వీరుసాయి, రోహిత్, బాలు నితిస్, పవన్, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసాచారిని సన్మానిస్తున్న నాయకులు

దేవరుప్పుల: మండలంలోని మాధాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా శ్రీమంతోజు శ్రీనివాసాచారీ, కార్యదర్శిగా గుర్రం అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తెలిపారు. ఉపాధ్యక్షులుగా మొటిక ఐలయ్య, చిలుకాని యాకయ్య, సహాయ కార్యదర్శిగా కొంగరి గిరి, కోశాధికారిగా గుర్రం రామచంద్రు, సలహాదారులుగా బుచ్చయ్య, యాకయ్య, మల్లయ్య, రతన్, భిక్షపతి ఎన్నికయ్యారు. అనంతరం మండల పార్టీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో బీసీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గణేశ్, సజ్జన్‌నాయక్, సీనియర్ నాయకులు పరీదుల భాస్కర్, మహేందర్‌జీ, భాగ్యనాయక్, ఉపసర్పంచ్ శ్రీధర్‌గౌడ్, కాడబోయిన వెంకన్న, దామెర అనిల్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన ఆటో డ్రైవర్లు

బచ్చన్నపేట: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల ధర్నాకు మండలం నుంచి అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు బుధవారం తరలివెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని యూనియన్ మండల అధ్యక్షుడు పస్తం అయిలయ్య అన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని, లేని పక్షంలో ఉచిత ప్రయాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎద్దు రమేష్, గణేష్, లక్ష్మణ్, కనుకయ్య, సిద్దులు, సుధాకర్, అయిలయ్య, భాస్కర్, సిద్ధులు, యాకూబ్‌పాషా, నర్సింహాలుతదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



రఘునాథపల్లి: మండలకేంద్రంలోని ఎస్ఎస్–15 ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్లే విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికందే విధంగా ఉన్న తీగలను సరిచేయాలని విద్యుత్ అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పది రోజుల క్రితం సంబంధిత ఏఈకి ఫోన్ చేసి సమస్య విన్నవించగా లైన్‌మన్‌ను పంపిస్తానని చెప్పి విస్మరించాడన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి మిడిల్ పోల్ వేసి ప్రమాదాన్ని నివారించాలని రైతులు కోరుతున్నారు.

గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం



ఎమ్మెల్యే కడియం శ్రీహరితో ప్రెస్ క్లబ్ కమిటీ

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో కమిటీ బాధ్యులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గ్రేటర్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రెస్ క్లబ్ కమిటీ ఆహ్వానం మేరకు త్వరలో ప్రెస్ క్లబ్‌కు వస్తామన్నారు. ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రెటరీలు, ఈసీ మెంబర్లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



దేవరుప్పుల: నివాళులర్పిస్తున్న నాయకులు



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న రాజయ్య తదితరులు

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పానుగంటి యాదగిరి తల్లి పానుగంటి కొండమ్మ (65) మృతి చెందింది. కాగా, బుధవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్, పార్టీ సీనియర్ నాయకుడు రుద్రోజు భాస్కరాచారి, పార్టీ గ్రామ అధ్యక్షుడు రుద్రోజు పురుషోత్తమచారి, మాజీ సర్పంచ్ బోనగిరి నర్సింహ, కన్న యాదగిరి, మునుగొండ పరశురాములు, మానుపాటి బుగ్గయ్య, పానుగంటి యాదయ్య, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

ఉప్పుగల్లులో..

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన సొంటిరెడ్డి మల్లారెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ రడపాక సుదర్శన్, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన బెజ్జం ఎల్లయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, బుధవారం బాధిత కుటుంబాన్ని గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. అదేవిధంగా ఆ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు. గౌడ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఎడ్ల యాకుబ్, మాజీ సర్పంచ్ బోయిని యాదగిరిస్వామి, నాయకులు ఎడ్ల రాజు, స్వామి, కుమార్, లక్ష్మణ్, శివకృష్ణ, యాకేబ్, వసంత్, కిషన్ ఉన్నారు.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలి



మురళీధర్, అధ్యక్షుడు

తరిగొప్పుల: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, సకాలంలో పీఆర్సీని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ మండల మహాసభ బుధవారం నిర్వహించి ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమ మురళీధర్, ఉపాధ్యక్షుడిగా జీడికంటి నర్సయ్య, మహిళా ఉపాధ్యక్షురాలుగా దాసరి స్రవంతి, ప్రధాన కార్యదర్శిగా ఆవుల అమర్నాథ్, కోశాధికారిగా బానోత్ రవీందర్, కార్యదర్శులుగా హేమలత, కార్తీక్, జిల్లా కౌన్సిలర్‌గా సుమిత్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతి, బదిలీలకు సంబంధించి కోర్టు కేసులు ఉన్నందున వాటి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి వెంటనే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు.

హామీలు అమలు చేయాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చాలా మంది వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే రైతులకు పంట రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణ మాఫీ పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే మహాలక్ష్మి పథకంలో 18–55 సంవత్సరాల మహిళలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్, నాయకులు గద్ద రాజు, బంగారు మహేష్, చిమ్ముల నరేందర్‌రెడ్డి, పోతుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో కూలిన ధ్వజస్తంభం



ఆలయంపై కూలిన ధ్వజస్తంభం

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల వేణుగోపాలస్వామి దేవాలయంలో బుధవారం తెల్లవారు జామున ధ్వజస్తంభం కూలింది. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం గత కొన్ని రోజులుగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నూతనంగా నిర్మించిన దుర్గమ్మగుడి వద్ద ధ్వజస్తంభ ఏర్పాటు సమయంలోనే వేణుగోపాలస్వామి ఆలయంలో కూడా శిథిలావస్థకు చేరిన ధ్వజస్తంభం స్థానంలో కొత్తగా ఏర్పాటు చేయాలని భావించారు. కానీ పలు కారణాలతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయకపోవడంతో శిథిలావస్థలో ఉన్నది కూలింది.